# ఆమె కోసం...

మనసొంపుగా






అందరూ మౌనంగా వున్నారు.

ఈ మౌనాన్ని ఛేదించే సాహసం చేయడం లేదెవ్వరూ.

అది ప్రశాంతత కాదు నిశ్శబ్దం.

చీమ చిటుక్కుమన్నా వినిపించేటంత నిశ్శబ్దం.

కాని నాకు తెలుసు, అందరి మనసులు వికలమై వున్నాయని. ఒక్కసారి అందరి ముఖాల వంక తేరిపార చూశాను. మామగారు, మావారు సతీష్, మరిది కేశవ్, మరదలు రాగిణి, మామగారి స్నేహితుడు గోవిందరాజు. భయం, ఆందోళన, ఆలోచన వారి ముఖాల్లో ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. మామగారి ముఖంలో మరీ. ఆయన మనసులో అగ్నిపర్వతాలు బ్రద్దలవుతున్నట్టు ఆయన్ని చూస్తేనే అర్థమవుతోంది.

కొద్దిక్షణాల తర్వాత గోవిందరాజు ఇబ్బందిగా కుర్చీలో అటుఇటు కదిలి, మెల్లగా లేచి నిలబడ్డారు.

"నేను వెళ్ళొస్తానండి." అన్నారాయన.

ఆమాటతో ఈ లోకంలోకి వచ్చిన మామగారు "ఆ..ఆ..ఆ..వెళ్ళిరండి, నేను తర్వాత మాట్లాడతాలే" అన్నారు. గోవిందరాజు వెళ్ళిపోయారు.

మళ్ళీ నిశ్శబ్దం. రెండు క్షణాల తర్వాత నేను మెల్లగా, "మామయ్యగారు! కొంచెం కాఫీ తెమ్మంటారా?" అన్నాను.

మామయ్యగారు విరక్తిగా నావంక చూసి ఊరుకున్నారు.

"మీరు బాగా అలసి పోయినట్టున్నారు. కాఫీ తెస్తాను, తాగి విశ్రాంతి తీసుకోండి " అన్నాను.

"ఇవుడేమీ తాగాలనిపించడం లేదమ్మా"

"అలాగంటే ఎలా మామయ్యా! ఈమధ్య మీ ఆరోగ్యం బాగుండడం లేదు. మీకు విశ్రాంతి చాలా అవసరం."

"ఇంకా ఒకటే విశ్రాంతి-శాశ్వతంగా"

"అవేం మాటలు మామయ్యా! మీరలా అనకూడదు"

"బ్రతికుండి చేసేదేముందమ్మా. ఈ వయసులో ఈ అవమానాన్ని భరించడం కంటే చావేమేలు. సుభద్ర అమ్మ గాయత్రి అన్న మాటలకు...నాకైతే తలబద్దలు కొట్టుకుని చావాలనిపిస్తోంది" అన్నారు.

నేను వెంటనే, అప్రయత్నంగానే మరిది కేశవ్ వంక చూశాను. కేశవ్ కళ్ళల్లో నీళ్ళు. ఏదో చెప్పాలని ప్రయత్నించాడు. కాని ఎందుకనో ఏమి మాట్లా

డకుండానే అక్కడి నుంచి లేచి వెళ్ళిపోయాడు. నేను, మామగారు, సతీష్, రాగిణి మిగిలాం.

"చావు బ్రతుకుల గురించి ఎందుకు నాన్నా మాట్లాడతావ్. అంత ఘోరాలేవీ జరగలేదిక్కడ. మీరు చిన్ని విషయాన్ని భూతద్దంలో చూస్తున్నారంతే," అంది కాస్త కటువుగా రాగిణి.

'నీకిది చాలా చిన్నవిషయంలా కనిపిస్తోందా?"

కోపంగా అన్నారు సతీష్. నేను సతీష్ భుజంపై చెయ్యివేసి నిగ్రహించుకోమన్నట్టు తట్టాను.

"నా దృష్టిలో చిన్న విషయమే. ఇలాంటివి దేశంలో బోలెడన్ని జరుగుతున్నాయి. అలా చేసిన వాళ్ళ పెద్ద వాళ్ళంతా తలలు బాదుకొని చచ్చిపోతున్నారా? ఎందుకంత బాధపడిపోతారు? అసలు సుభద్ర మదర్ గాయత్రి మాట్లాడుతున్నప్పుడు నన్ను రానివ్వలేదుకాని, లేకపోతే అప్పుడే ఆపెద్దిని కడిగిపారేసేదాన్ని. ఆవిడ అలా ఇష్టం వచ్చినట్టు పేలుతుంటే మనం నోరుమూసుకుని ఎందుకు దద్దమ్మల్లా కూర్చోవాలి?"

ఆవేశంగా అంది రాగిణి.

"తప్పు మనవైపు వుంది కాబట్టి... ఇది కుటుంబ పరువు ప్రతిష్టలకు సంబంధించినది కాబట్టి"..అన్నారు మామయ్యగారు.

"తప్పు మన కేశవ్‌దే కాదు. ఇద్దరిదీ. ఈ తప్పులో సుభద్ర క్కూడా భాగముంది. సుభద్రను వదిలేసి కేశవ్‌ను తప్పనడితే ఎలా? కేశవ్ ఆ అమ్మాయిని కావాలని రేప్ చేయలేదే! ఇద్దరూ ఇష్టపడే కలుసుకున్నారు దట్సాల్. ఇందులో కేశవ్‌నే ఎందుకు తప్పు పట్టాలో నాకర్థం కావడంలేదు" అంది రాగిణి.

"చూడమ్మ! నువ్వింకా చిన్నపిల్లవి. ఆవేశం ఎక్కువ ఆలోచన తక్కువ. స్థిమితంగా ఆలోచించు. ఇటువంటి పరిస్థితుల్లో ఆడపిల్ల కంటే మగాణ్నే ఈలోకం వేలెత్తి చూపుతుంది. ఇలా జరిగినపుడు కష్టనష్టాలన్నీ ఆడపిల్లకే తగులుతాయి. అందువల్ల మనం సంయమనంతో వ్యవహరించాలి." అన్నారు మామయ్య.

"నాకు రాగిణి చెప్పిందే కరెక్టనిపిస్తోంది నాన్నగారు, తమ్ముడేమో అమ్మాయిల్తో తిరిగే జులాయి వెధవ కాదుగా. ఇద్దరికీ కొంతకాలంగా ఫ్రెండ్‌షిప్ వుంది. అది అందరికీ తెలిసినదే! ఏదో వయసు...తొందరపడ్డారు...ఓ.కే. దీన్ని గోరంతలు కొండంతలు చేయడం వేస్ట్, దీనికింత ఆలోచన కూడా అనవసరం. తమ్ముడ్ని దోషి అనడం మంచిది కాదనిపిస్తోంది. నా ఉద్దేశ్యంలో అందరూ ఇష్టపడితే ఇద్దరికీ పెళ్ళిచేసేయడం బెస్ట్." అన్నారు సతీష్

"ఏరా! అన్నీ తెలిసీ నువ్వుకూడా అలా మాట్లాడతావేం? గాయత్రిగారు ఎన్నెన్ని మాటలు అన్నదో విన్నావుగా!ఆవిడ ధోరణి చూస్తే పెళ్ళికి ఒప్పుకునేలా లేదు" అన్నారు మామయ్య.

"అసలు పెళ్ళి ఎందుకు? పెళ్ళిచేయడమంటే మన తప్పు చేసినట్టు ఒప్పుకున్నట్టే! గాయత్రిని పిలిచి మరోసారి మాట్లాడండి. మాట్లాడడం అంటే బ్రతిమలాడుతున్నట్టు కాదు, గట్టిగా దబాయించి మాట్లాడండి. అసలు ఆవిడకేం కావాలో తెలుసుకోండి. కావాలంటే ఈ వ్యవహారాన్ని డబ్బుతో సెటిల్ చేయడం బెటర్ అని నా అభిప్రాయం" అంది రాగిణి.

"నువ్వేమంటావ్‌రా?" సతీష్‌ని అడిగారు మామయ్య.

"మీఇష్టం నాన్నగారు కాని రాగిణి చెప్పినదాంట్లో కూడా పాయింట్ వుందనిపిస్తోంది. మీరు ఓసారి ఆలోచించి స్టెప్ తీసుకోండి" అన్నాడు సతీష్.

మామయ్య గారు నావంక 'నీ అభిప్రాయం ఏమిటన్నట్టు' చూశారు. అందరి మాటలు వింటూ కూర్చున్న నేను క్షణం సేపు తత్తరపడ్డాను. రెండు క్షణాల తర్వాత నెమ్మదిగా,

"ఇది ఒక ఆడపిల్ల జీవితానికి, మన కుటుంబ పరువు ప్రతిష్టలకు సంబంధించినది. వీటిలో దేనికీ దెబ్బ తగలకూడదు. రాగిణి ఇచ్చిన సలహా నాకు ఒక బిజినెస్ డీల్‌లా అనిపించింది. అది కేవలం నావ్యక్తిగత అభిప్రాయం. నా అభిప్రాయం తప్పైనా కావచ్చు కూడా. అయితే జరిగిన సంఘటన కంటే సుభద్ర తల్లి గాయత్రి గారిమ్మాటల ధోరణే నన్ను మరింత ఆందోళన పరిచింది. ఆవిడ చాలా కరకుగా మాట్లాడుతున్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే దుమ్మెత్తిపోస్తున్నారు. ఆడపిల్ల తల్లిగా ఆమె ఆవేదన పడుతోందని సరిపెట్టుకుందాం. కాని ఈ విషయంలో మన అభిప్రాయం కంటే ముందుగా కేశవ్ అభిప్రాయాన్ని తీసుకుంటే బాగుంటుంది. కేశవ్‌ని వదిలేసి మనం ఏదేదో మాట్లాడుకోవడం... మీరే ఆలోచించండి" అన్నాను.

రెండు నిముషాలు అంతా మౌనంగా వుండిపోయారు, తర్వాత మామయ్యగారు,

"నువ్వు చెప్పిందే సబబుగా వుందమ్మా. ముందు కేశవ్‌తో మాట్లాడాలి. నువ్వే మాట్లాడమ్మా "అన్నారు.

"నేనా?...అన్నీ సతీష్ వున్నారుగా" అన్నాను తడబడుతూ.

"వాడా! వాడూ, రాగిణి ఒకటేనమ్మా, ఆవేశం ఎక్కువ. మాట్లాడమని పంపిస్తే వాడితో గొడవపడి వస్తాడు. ఈ ఇంట్లో అందరికీ నువ్వంటే గౌరవం. నీమాటకు విలువ ఎక్కువ. అందుకే నువ్వే వాడితో మాట్లాడు." అని అక్కడినుంచి లేచి వెళ్ళిపోయారు.

సాయంత్రం మామయ్య, సతీష్ బయటకు వెళ్ళారు. రాగిణి ఫ్రెండ్ ఇంటికి వెళ్ళింది. అదే తగిన సమయమని కేశవ్‌ని నాగదిలోకి పిలిచాను. కేశవ్ ముఖం ఎర్రగా కందిపోయివుంది. తలదించుకుని బెడ్ ప్రక్కనే వున్న స్టూల్‌పై కూర్చున్నాడు. సంభాషణ ఎలా ప్రారంభించాలా? అని కొద్ది క్షణాలు ఆలోచించి,

"సుభద్ర అంటే నీకిష్టమేనా?" అని డైరెక్ట్‌గా అడిగేశాను. కేశవ్ ఔననలేదు, కాదనలేదు. అలాగే వుండిపోయాడు.

"చూడు కేశవ్ ఇది నీ పర్సనల్ మేటర్, నేను అనవసరంగా కలగచేసుకుంటున్నానని నీకనిపిస్తే ఐయామ్‌సారీ. ఈఇంటి కోడలిగా నీపర్సనల్ విషయాల్లో జోక్యం చేసుకోగల చనువు వుందనుకుంటాను. నీకిష్టం లేకపోతే నాకేమి చెప్పొద్దు. కాకపోతే ఒక్కమాట నువ్వన్నా, రాగిణి అన్నా నాకు ఎంతో అభిమానం. ఈ ఇంటిలోకి అడుగు పెట్టినప్పటి నుంచి మీరిద్దరు ఎంతగానో నాతో కలిసిపోయారు. ఆ చనువుతోనే..."

నామాటలు పూర్తి కాకుండానే కేశవ్ తలెత్తి,

"వదినా..ప్లీజ్" అన్నాడు. కేశవ్ కళ్ళల్లో నీళ్ళు నిండిపోయాయి. గొంతు బొంగురుపోయింది. కేశవ్‌ని అలా చూడగానే నాకు జాలేసింది. పసిపిల్లాడిలా అనిపించాడు నాకాక్షణంలో. రెండు క్షణాల తర్వాత కేశవ్ తనను తాను కంట్రోల్ చేసుకొని,

"వదినా ఈ రెండు రోజుల్లో నాతో ఆప్యాయంగా మాట్లాడింది నువ్వే. అంతా నన్ను దుర్మార్గుడిలా, దోషిగా చూస్తున్నారు. నావైపు కన్నెత్తి చూడడం లేదు. ఎవరూ మాట్లాడడం లేదు. ఈరెండు రోజుల్లో నేనందరికీ ఎంతో దూరమైపోయాను." అన్నాడు కేశవ్.

"అదేం లేదు. అంతా నీభ్రమ అంతే. నీగురించి ఎవరు చెడుగా అనుకోవడం లేదు. అసలు చెడుగా అనుకోవడానికి కేముంది? చెప్పు?" అన్నాను.

కేశవ్ మౌనంగా వుండిపోయాడు. నేను రెండు క్షణాలాగి మళ్ళీ

"చూడు కేశవ్! నీమీద నాకు నమ్మకం వుంది. నువ్వు నాకు అబద్ధం చెప్పవ్. ఏం జరిగిందో నాకు వివరంగా చెప్పు.పోనీ నాకు చెప్పడానికి ఇబ్బందయితే మి అన్నయ్యతో చెప్పు" అన్నాను అనునయంగా.

"వద్దు వదినా!నీకే చెబుతాను. అమ్మ ప్రేమను చిన్నపుడే పోగొట్టుకున్నాను. నువ్వు ఈ ఇంటిలోకి ప్రవేశించిన ఈ నాలుగేళ్ళలో ఆ అమ్మ ప్రేమను పొందగలుగుతున్నాను. నీకే చెప్తాను వదినా" అంటూ కేశవ్ తనకు, సుభద్రకు ఏర్పడిన పరిచయాన్ని, ఆతరువాత జరిగిన సంఘటనలను పూసగుచ్చినట్టు చెప్పాడు. కేశవ్ చెప్పిన విషయాలు విని నేను అవాక్కయ్యాను. తేరుకోవడానికి నాకు చాలా సమయం పట్టింది.

(తర్వాత ఏం జరిగిందో వచ్చేవారం తెలుస్తుంది)

— "మోతీలాస్య"